### రేషన్ కార్డుతో లింక్ పెట్టొద్దు



పంట పండించే రైతుకు ఆధార్ కార్డు లింకుతో పదెకరాల వరకు రైతు భరోసా ఇవ్వాలి. రేషన్ కార్డుతో లింకు పెట్టొద్దు. ₹500 బోనస్ ఒక్క సన్నరకాలకే కాకుండా దొడ్డురకాలకు కూడా అందించాలి. రైతు రుణమాఫీని ఎలాంటి ఆంక్షలు లేకుండా అమలు చేయాలి. రైతులకు డ్రిప్ పరికరాలు అందించి ఆదుకోవాలి.

**- ఎలాల వెంకట్‌రెడ్డి, రైతు (ఇబ్రహీంపట్నం మండలం)**



మల్యాల : రైతువేదికలో మాట్లాడుతున్న రైతు తుంగతుర్తి రామారావు

# రైతు భరోసా సకాలంలో ఇవ్వాల్సిందే!

**పంటలు వేసి, కోతకు వచ్చే దశలో ఇస్తే ఏం ప్రయోజనం?**

**కేసీఆర్ సర్కారు తరహాలో టైమ్‌కు అందించాలి**

- ఒక్కో రైతు ఎంత సాగు చేస్తే అంత భూమికి ఇవ్వాలి
- అవసరమైతే క్షేత్రస్థాయిలో సర్వే చేయించాలి
- అంతేగాని షరతులు పెట్టొద్దు.. ఆగం చేయద్దు
- రేషన్ కార్డు, ఐటీ నిబంధనలు విధించవద్దు
- రైతువేదికల్లో వ్యవసాయశాఖ మంత్రి వీడియోకాన్ఫరెన్స్‌లో రైతుల అభిప్రాయాలు



తిమ్మాపూర్ : తిమ్మాపూర్ రైతు వేదికలో వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న రైతులు

కేసీఆర్ ప్రభుత్వం ఇచ్చినట్టుగానే సీజన్ ప్రారంభానికి ముందే రైతుభరోసా ఇవ్వాల్సిందేనని రైతులు తేల్చిచెప్పారు. పంటలు వేసి, కోతకు వచ్చే దశలో ఇస్తే ఏం ప్రయోజనమని, సకాలంలో అందితేనే ఫలితం ఉంటుందని తెలిపారు. పెట్టుబడి సాయానికి షరతులు పెట్టవద్దని, రేషన్, ఐటీ వంటి నిబంధనలు మినహాయించాలని స్పష్టం చేశారు. ఒక్కో రైతు ఎంత సాగు చేస్తే అంత భూమికి ఇవ్వాలని, అవసరమైతే అధికారులతో క్షేత్రస్థాయిలో సర్వే చేయించాలని సూచించారు. మంగళవారం రైతు భరోసా పథకంపై మార్గదర్శకాలు ఏ విధంగా అమలు చేస్తే రైతులకు ఉపయోగకరంగా ఉంటుందనే అంశంపై రైతుల అభిప్రాయాలు సేకరించడంతోపాటు వారి సూచనలు, సలహాలను వీడియో కాన్ఫరెన్స్ ద్వారా తీసుకున్నారు. ప్రతి నియోజకవర్గంలో ఒకచోట నిర్వహించిన ఈ వీసీలో రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్, ప్రిన్సిపల్ సెక్రటరీ, ఉన్నతాధికారులు పాల్గొని రైతుల అభిప్రాయాలు తెలుసుకోగా, పలువురు పై విధంగా స్పందించారు.

**- పెద్దపల్లి/ సుల్తానాబాద్‌రూరల్ / మంథని/ కమాన్‌పూర్/ పాలకుర్తి, జూన్ 25**

### నిబంధనలు లేకుండా ఇవ్వాలి



రైతులకు ఎలాంటి నిబంధనలు, ఆంక్షలు లేకుండా రైతు భరోసా సాయం అందించాలి. ఏక కాలంలో ₹2 లక్షల రుణ మాఫీ చేయాలి. రైతు భరోసాకు రేషన్‌కార్డు, ఐటీ పేయర్ అని చూడద్దు. భూమిలో సాగు చేస్తే రైతుకు ఎలాంటి నిబంధనలు లేకుండా ఇవ్వాలి. అలాగే, రైతులకు సబ్సిడీపై వ్యవసాయ పరికరాలు, బిందు, తుంపర సేద్యం పరికరాలు అందించాలి.

**-వీరబత్తిని సత్యనారాయణ, రాపల్లి (గొల్లపల్లి మండలం)**



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న రైతు రమణారెడ్డి

### ఐటీతో సంబంధం లేకుండా ఇవ్వాలె

రైతు భరోసా పథకాన్ని పదెకరాల వరకు ఉన్న రైతులకు ఇస్తే ప్రయోజనకరంగా ఉంటుంది. నిజమైన ప్రతి ఒక్క రైతుకు భరోసా అందజేయాలి. పంటల సాగుకు ముందు పెట్టుబడికి ఉపయోగపడేలా ఎకరానికి ₹7500 రైతు ఖాతాలో జమ చేయాలి. అలాగే, రైతులందరూ గృహావసరాలు, ఇతర లోన్ల కోసం ఐటీలు కడుతున్నరు. అలాంటప్పుడు ఐటీ కట్టే వారికి రైతు భరోసా ఇవ్వకపోతే చాలా నష్టపోతరు. ఐటీతో సంబంధం లేకుండా, ఎలాంటి కండీషన్లు లేకుండా రైతుభరోసా అందజేయాలి.

**- మోరపల్లి రమణారెడ్డి, రైతు, మొగిలిపాలెం (తిమ్మాపూర్ మండలం)**



### పదెకరాల దాకా ఇవ్వాలి

గత ప్రభుత్వం రైతుబంధు పేరిట ఎకరానికి ఏటా ₹10 వేలు ఇచ్చింది. ప్రస్తుత ప్రభుత్వం రైతు భరోసా పేరిట ఎకరానికి ₹15 వేలు ఇస్తామని ఎన్నికల సమయంల హామీ ఇచ్చింది. ఈ పథకాన్ని అందరికీ కాకుండా కొందరికి మాత్రమే ఇస్తామని చెప్పడం అన్యాయం. ఇచ్చేదేదో సాగుకు ముందు ఇస్తే మంచిది.

**- నరహరి నారాయణరెడ్డి, రైతు (ఎలిగేడు మండలం)**

### మెలిక పెట్టడం సరికాదు



ఇప్పుడు ఎవుసం చేసేందుకు ఎవరూ ముందుకు రావడం లేదు. 40 ఏళ్లు పైబడిన వారే వ్యవసాయం వైపు మొగ్గు చూపుతున్నరు. యువకులు నగరీకరణ, ఉద్యోగాల వైపే వెళ్తున్నరు. రైతు భరోసా అమలులో ప్రభుత్వం ఏ రీతిన ఆలోచిస్తుందో తెలువదు. కానీ, సాగు చేసిన వ్యవసాయ భూమికి పరిమితి లేకుండా రైతుభరోసా అందజేయాలి. కౌలు రైతులకు నేరుగా అందిస్తామంటే క్షేత్రస్థాయిలో యజమానులు తమ భూములను పడావు ఉంచుకుంటారే తప్ప కౌలుకు ఇవ్వరు. తద్వారా కౌలు రైతుల జీవన విధానంపై ప్రభావం పడుతుంది. అంతెందుకు నేనే ఒక పదెకరాలు మల్యాల మండలం పోతారంలో కౌలుకు తీసుకొని సాగు చేస్తున్న. ఒక వేళ కౌలు రైతుల గురించి ఆలోచించి ప్రభుత్వం తరఫున అందజేసే పెట్టుబడి సాయాన్ని భూ యజమానికి సగం, కౌలు రైతులకు సగం ఇస్తే కొంత మేర ఇద్దరికీ న్యాయం జరుగుతుంది. ఒక్కో రైతు ఈ రోజుల్లో 20 ఎకరాలు సైతం సాగు చేసే అవకాశమున్నది. ఐదెకరాలు సాగు చేస్తే రైతులకు ఏం మిగులుది? దాంట్లో పిల్లల్ని ఏం పెట్టి చదివిస్తం? పరిమితి లేకుండా ఎంత సాగు చేస్తే అంత పెట్టుబడి సహాయం అందజేయాలె. అవసరమైతే క్షేత్రస్థాయి పరిశీలన జరిపి సాగు వివరాలు పక్కాగా సేకరించాలి. ఎవరైనా అవకతవకలకు పాల్పడితే సస్పెండ్ చేయాలి. రైతుభరోసా, రుణమాఫీ వంటి పథకాలకు రేషన్‌కార్డు, ఐటీ రిటర్న్ అనే మెలిక పెట్టడం సరికాదు. ఈ నిబంధనను ఉపసంహరించుకోండి.

**- తుంగతుర్తి రామారావు, పోతారం (మల్యాల మండలం)**

### సాకులు చూపద్దు



రైతులు రెక్కలు ముక్కలు చేసుకొని ఆరుగాలం కష్టపడి పంటలు పండిస్తరు. అలాంటి రైతులకు రైతు భరోసా ఇచ్చేందుకు కండీషన్లు పెట్టద్దు. కారు ఉన్నదనో.. ఇల్లు ఉన్నదనో.. రేషన్ కార్డు లేదనో.. ఐటీ కడుతున్నాడనో.. ఇలాంటి సాకులు చూపద్దు. భూమి ఉన్న రైతులకు రైతు భరోసా కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. ఎన్నికలప్పుడు రైతులందరికీ రైతు భరోసా కల్పిస్తామని చెప్పి ఇప్పుడు షరతులు పెట్టడం సరికాదు.

**- ఒడ్నాల సతీశ్, రైతు, నాగారం (కమాన్‌పూర్ మండలం)**

### కాలయాపన చేయడం కరెక్ట్ కాదు



రైతు భరోసా అందించడంలో ప్రభుత్వం కాలయాపన చేస్తున్నది. ఇది కరెక్ట్ కాదు. సన్న వడ్లకు ₹500 బోనస్ ఇస్తామని, దొడ్డు వడ్లకు ఇవ్వమని ప్రకటించడం అన్యాయం. నేల రకం, నీటి వసతి, పెట్టుబడి, తదితర అంశాలను పరిగణలోకి తీసుకుని రైతులు పంట సాగు చేస్తరు. కాబట్టి అన్ని రకాల వడ్లకు బోనస్ ఇవ్వాలె. పదెకరాలలోపు ఉన్న రైతులందరికీ రైతు భరోసా ఇవ్వాలి. ఇప్పటికే సాగు ప్రారంభమైంది. పెట్టుబడి సాయం కోసం రైతులు ఎదురు చూస్తున్నరు. ప్రకృతి, ప్రభుత్వం రెండూ రైతును పగబట్టినట్టు కన్పిస్తున్నది. వర్షాలు లేక, పెట్టుబడి సాయం అందక అన్నదాతలు అయోమయంలో ఉన్నరు.

**- పాల తిరుపతిరావు, రైతు, నిట్టూరు, పెద్దపల్లి**

### అదునుకు ముందే ఇవ్వకుంటే ఇబ్బందే



ఇంతకు ముందు కేసీఆర్ ప్రభుత్వం రైతులకు ఇచ్చినట్టుగానే సీజన్ ప్రారంభంలోనే రైతు భరోసా ఇవ్వాలి. గతేడాది యాసంగి సీజన్ పైసలు పంటకోతల సమయంల జమైనయ్. ఈ సంవత్సరం ఇప్పటికే రైతులు వ్యవసాయపనులు ముమ్మరంగా చేస్తున్న రు. కానీ, ఇంకా రైతు భరోసా పడలేదు. అదునుకు పంటసాయం అందకపోవడం వల్ల రైతులు ఇబ్బంది పడుతరు.

**- తిప్పని ప్రశాంత్ యువరైతు, కుక్కలగూడూర్ (పాలకుర్తి మండలం)**

### పంటల సాగుకు ముందే ఇవ్వాలి



సీజన్‌కు ముందే రైతు భరోసా ఇవ్వాలి. పంటల సాగుకు ఏ ఇబ్బంది రాకుండా ముందే రైతుల ఖాతాల్లో జమ చేయాలి. గతంలో వానకాలం, యాసంగి పంటలు ప్రారంభం కాకముందే రైతుల అకౌంట్లలో రైతుబంధు డబ్బులు జమయ్యేవి. కానీ, పోయిన యాసంగిల పంటలు చివరి దశకు వచ్చినా పెట్టుబడి జమ కాక చాలా ఇబ్బంది పడ్డం. కాంగ్రెస్ ప్రభుత్వం పదెకరాల లోపు ఉన్న చిన్న, సన్న కారు రైతులందరికీ ఎలాంటి నిబంధనలు పెట్టకుండా రైతు భరోసాను నేరుగా వారి ఖాతాల్లోకి జమ చేయాలి. భూమి ఉండి, పంటలు పండిస్తున్న రైతులందరినీ అర్హులుగా గుర్తించాలి. విత్తనాలు, ఎరువుల కొరతలు లేకుండా చర్యలు తీసుకోవాలి.

**- కొలిపాక పోచాలు, రైతు, పెంచికల్‌పేట్ (కమాన్‌పూర్ మండలం)**

### సాగు చేయని భూములకు ఇవ్వొద్దు



రైతు భరోసాను పదెకరాల వరకు ఉన్న వారందరికీ వర్తింపజేయాలి. పంటలు సాగు చేయని భూములకు ఇవ్వకుండా పదెకరాల లోపు ఉన్నవారికి ఇస్తే మధ్య తరగతి రైతులకు మేలు జరుగుతది. ఎన్నికల ముందు ఇచ్చిన హామీ ప్రకారం ₹2 లక్షల రైతు రుణమాఫీని ఏక కాలంలో అమలు చేయాలి.

**-కొక్కు గంగారాం, రైతు (సారంగాపూర్)**

# హైదరాబాద్ చేరిన కాంగ్రెస్ పంచాయితీ



- సోమవారం అర్ధరాత్రి పట్నంవెళ్లిన ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి
- తన పదవికి రాజీనామా చేస్తున్నట్టు ప్రకటన
- అసెంబ్లీ కార్యదర్శికి సమాచారం చేరవేత
- రంగంలోకి డిప్యూటీ సీఎం భట్టి, కేసీ వేణుగోపాల్
- అయినా రాజీనామావైపే అడుగు
- రేవంత్‌రెడ్డి తీరుపై భగ్గుమంటున్న పార్టీ శ్రేణులు
- ఉమ్మడి జిల్లాలోని కీలక నాయకులు, సంజయ్ కుట్రవల్లే అన్యాయం జరిగిందంటున్న శ్రేణులు

కాంగ్రెస్‌లో జగిత్యాల బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ చేరికతో మొదలైన పంచాయితీ మంగళవారం హైదరాబాద్‌కు చేరింది. సీనియర్ నాయకుడు, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డికి మాటైనా చెప్పకుండా సీఎం రేవంత్‌రెడ్డి తన సమక్షంలో చేర్చుకోవడంతో చిచ్చు రాజుకున్నది. ఓవైపు పార్టీ శ్రేణుల్లో తీవ్ర అసంతృప్తి వ్యక్తం కాగా.. మరోవైపు జీవన్‌రెడ్డి రాజీనామాకు సిద్ధం కావడంతో అధిష్ఠానం బుజ్జగించే ప్రయత్నాలు చేసింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు విప్‌లు లక్ష్మణ్ కుమార్, ఆది శ్రీనివాస్ నచ్చజెప్పినా.. డిప్యూటీ సీఎం భట్టి, మంత్రి ఉత్తమ్ ఫోన్‌లో ప్రయత్నించినా.. రాత్రి మంత్రి శ్రీధర్‌బాబు వచ్చి దౌత్యం చేసినా ససేమిరా అనడంతో వాతావరణం మరింత వేడెక్కింది. కాగా, అర్ధరాత్రి సమయంలో జీవన్‌రెడ్డి హైదరాబాద్ వెళ్లగా.. మంగళవారం కూడా అదే పరిస్థితి కనిపించింది. ఉప ముఖ్యమంత్రి, మంత్రి శ్రీధర్‌బాబు, లక్ష్మణ్ కుమార్ అక్కడ జీవన్‌రెడ్డి ఇంటికి వెళ్లి మంతనాలు జరిపినా ఫలితం లేక వెనుదిరగాల్సి వచ్చింది. 'మీ సేవలను పార్టీ గుర్తిస్తుంది. సముచిత స్థానం కల్పిస్తుంది' అన్న మంత్రుల మాటలను ఖండించడమే కాదు, ప్రభుత్వ హామీలపై పనిచేయకుండా.. ప్రజలకు సేవ చేయకుండా బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలను ఎందుకు తీసుకోవాల్సి వస్తున్నదంటూ దుమ్మెత్తిపోసినట్టు తెలిసింది.

జగిత్యాల, జూన్ 25, (నమస్తే తెలంగాణ) : కాంగ్రెస్‌లో జగిత్యాల బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే డాక్టర్ మాకునూరి సంజయ్ చేరికతో రాజీనామాకు సిద్ధమైన సీనియర్ నాయకుడు, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి సోమవారం పొద్దంతా ఎవరు వచ్చి బుజ్జగించినా ససేమిరా అన్నారు. చివరకు అర్ధరాత్రి సమయంలో హైదరాబాద్ వెళ్లిపోయారు. మంగళవారం మధ్యాహ్నం అసెంబ్లీకి వెళ్లి కార్యదర్శికి తన రాజీనామా లేఖను అందజేస్తానని ప్రకటించిన విషయం మీడియాలో రావడంతో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి శ్రీధర్ బాబు, లక్ష్మణ్ కుమార్ తదితరులు రంగంలోకి దిగారు. మంగళవారం బేగంపేట ప్రకాశ్‌నగర్‌లో ఉన్న జీవన్‌రెడ్డి ఇంటికి వెళ్లి ఆయనతో మంతనాలు జరిపారు. 'మీ సేవలను పార్టీ గుర్తిస్తుంది. సముచిత స్థానం ఇస్తుంది' అన్న మంత్రుల మాటలను జీవన్‌రెడ్డి ఖండించినట్టు సమాచారం. 'సీనియారిటీ, సిన్సియార్టీకి విలువలేని చోట ఉండడం వ్యర్థం. ఇదేం పద్ధతి? కాంగ్రెస్‌లో ఇప్పుడు ఎమ్మెల్యేలను చేర్చుకోవాల్సిన అవసరం ఏమొచ్చింది?' అంటూ ప్రశ్నల వర్షం కురిపించినట్టు తెలుస్తున్నది. ఇటు రాజీనామా లేఖ అందిస్తానని ప్రకటించిన నేపథ్యంలో అధిష్ఠానం అసెంబ్లీలో కార్యదర్శిని అందుబాటులో ఉంచకుండా జాగ్రత్త పడినట్టు తెలిసింది. భట్టి విక్రమార్క, శ్రీధర్‌బాబుతో మాట్లాడుతున్న సమయంలోనే.. 'రాజీనామా పత్రం ఇవ్వడానికి వస్తున్నా. అందుబాటులో ఉండండి' అని సెక్రటరీకి జీవన్‌రెడ్డి ఫోన్‌లో చెప్పేందుకు యత్నించినా స్పందించనట్టు సమాచారం. ఈ క్రమంలో రాష్ట్ర కాంగ్రెస్ ఇన్‌చార్జి, ఏఐసీసీ సెక్రెటరీ కేసీ వేణుగోపాల్‌తో ఉప ముఖ్యమంత్రి భట్టి ఫోన్‌లో మాట్లాడించిన సమయంలోనూ జీవన్‌రెడ్డి తన అసంతృప్తి వ్యక్తం చేసినట్టు తెలిసింది. తొందర పడొద్దని, సముచిత స్థానం ఉంటుందని వేణుగోపాల్ నచ్చజెప్పే ప్రయత్నం చేసినా పెద్దగా స్పందించలేదని తెలిసింది. కాగా, మంత్రులు, కాంగ్రెస్ నాయకులు వెళ్లిపోయిన తర్వాత తన కోసం జగిత్యాల నుంచి హైదరాబాద్‌కు వచ్చిన కార్యకర్తలు, నాయకులతో సమాలోచనలు జరుపుతున్నట్టు సమాచారం.

### రేవంత్‌రెడ్డి తీరుపై అసంతృప్తి!

సీఎం రేవంత్‌రెడ్డి వ్యవహార శైలిపై సోమవారం వరకు పరోక్షంగా తన అసంతృప్తిని వ్యక్తం చేసిన జీవన్‌రెడ్డి, మంగళవారం హైదరాబాద్ వేదికగా బాహాటంగానే మండిపడ్డారు. డిప్యూటీ సీఎం భట్టి, ఏఐసీసీ సెక్రెటరీ వేణుగోపాల్‌తో మాట్లాడుతూ, 'పార్టీలోకి బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలను ఎందుకు తీసుకుంటున్నారు? ఇదేం పద్ధతి? ఇప్పుడు ప్రభుత్వానికి వచ్చిన ఆప ద ఏం లేదు కదా..? అని ప్రశ్నించినట్టు సమాచారం. '64 మంది ఎమ్మెల్యేలు గెలిచిన్రు. ఒక సీపీఐ ఎమ్మెల్యే మద్దతు ఉంది. ఏడుగురు సభ్యులున్న ఎంఐఎం సైతం మద్దతుగా వచ్చే అవకాశమున్నది. ఈ లెక్కన 73 మంది ఎమ్మెల్యేల మ ద్దతు ఏర్పడుతుంది. ఈ సమయంలో బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలను ఎందుకు తీసుకోవాల్సి వస్తున్నది? ప్రభుత్వ హామీలపై పనిచేయకుండా, ప్రజలకు సేవ చేయకుండా, ఇదేం వ్యవహారం?' అంటూ దుమ్మెత్తిపోయడంతోపాటు సీఎం రేవంత్‌రెడ్డి వ్యవహారశైలిని సైతం ఎండగట్టినట్టు సమాచారం.

### వ్యతిరేకంగా పనిచేస్తారా? : జీవన్ రెడ్డి

జీవన్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ, కాంగ్రెస్ ముఖ్య నాయకుడు, రాహుల్‌గాంధీ అభీష్టానికి వ్యతిరేకంగా, కాంగ్రెస్ పార్టీ పాంచ్ న్యాయ్ సూత్రాలకు విరుద్ధంగా రేవంత్‌రెడ్డి వ్యవహరించడం సరికాదని నేరుగానే స్పష్టం చేశారు. ఒక పార్టీలో గెలిచి మరో పార్టీలోకి ఫిరాయించే వ్యవస్థ సరికాదని భావించే మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ ఫిరాయింపుల నిరోధక చట్టాన్ని తెచ్చారని గుర్తు చేశారు. ఈ చట్టంలోని కొన్ని లోపాల ఆధారంగా పార్టీ ఫిరాయింపులను సరిగా అడ్డుకోలేక పోతున్నామని, ఇది రాహుల్‌గాంధీ నేతృత్వంలోని కాంగ్రెస్ పార్టీ భావించిందని చెప్పారు. ఈ చట్టానికి సవరణ తెచ్చి మరింత పకడ్బందీగా రూపొందించాలని రాహుల్‌గాంధీ భావించి, కాంగ్రెస్ పాంచ్ న్యాయ్ సూత్రాల్లో ఒకటిగా దీన్ని చేర్చిన విషయం అందరు గుర్తుకు తెచ్చుకోవాలన్నారు. రాహుల్‌గాంధీ ప్రతిపాదించిన పాంచ్ న్యాయసూత్రాలకు, పార్టీ ఫిరాయింపు నిరోధక అంశాలకు వ్యతిరేకంగా ప్రభుత్వ, పార్టీ నాయకుడు వ్యవహరించడం సరికాదని సూచించారు.

### ఈ పాపం సీఎం, జిల్లా మంత్రులదే!

'జీవన్‌రెడ్డితోపాటు శ్రేణులను మనోవేదనకు గురిచేసిన పాపం సీఎం రేవంత్‌రెడ్డి, ఉమ్మడి జిల్లాకు చెందిన కీలక కాంగ్రెస్ నాయకులదే' అంటూ జగిత్యాలకు చెందిన కాంగ్రెస్ నాయకులు రగిలిపోతున్నారు. జీవన్‌రెడ్డి పార్టీలో ఉన్నందున తమకు గుర్తింపు రావడం లేదని, ఆయనను పార్టీలో లేకుండా చేస్తేనే తమకు మేలు జరుగుతుందని ఉమ్మడి జిల్లాలోని కీలక పదవుల్లో కొందరు ప్రజాప్రతినిధులు భావించారని బాహాటంగానే విమర్శిస్తున్నారు. దీనికితోడు సీనియర్ నాయకుడైన జీవన్‌రెడ్డితో ఎన్నటికైనా తనకు ఇబ్బందేనని రేవంత్‌రెడ్డి గ్రహించాడని, అందుకే సీఎం, ఇక్కడి నేతలు కలిసి పొగబెట్టి, సాగనంపే పథకం రచించారని ఆరోపించారు. ఫిబ్రవరిలోనే జగిత్యాలకు చెందిన ఓ కీలక కాంగ్రెస్ ప్రజాప్రతినిధి కొండగట్టు వద్ద జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్‌తో రహస్యంగా సమావేశమై, సీఎంను కలువాలని సూచించి, కథకు ఆజ్యం పోశాడని చెబుతున్నారు. సీఎంను కలిసిన తర్వాత పార్టీలో చేరవద్దని ఎమ్మెల్యేకు చెప్పిన ఉమ్మడి జిల్లాకు చెందిన ఓ ఇద్దరు ప్రజాప్రతినిధులు, ఎంపీ ఎన్నికల్లో జీవన్‌రెడ్డిని ఓడించిన తర్వాతే పార్టీలోకి రావాలని సూచించారని పేర్కొంటున్నారు. రేవంత్‌రెడ్డి, ముగ్గురు ఉమ్మడిజిల్లా ప్రజాప్రతినిధులు, జగిత్యాల ఎమ్మెల్యే కలిసి జీవన్‌రెడ్డి ఓటమికి వ్యూహం రచించారని బాహాటంగానే విమర్శిస్తున్నారు. జీవన్‌రెడ్డితోపాటు దశాబ్దాలుగా కాంగ్రెస్‌ను నమ్ముకొని ఉన్న కార్యకర్తలు, నాయకులను ఏడిపిస్తున్న పాపం కచ్చితంగా తగిలి తీరుతుందని కార్యకర్తలు శాపనార్థాలు పెడుతున్నారు.

## ఉడుములు పడితే అరెస్ట్

- బావుపేట తమిళ కాలనీలో అటవీశాఖ అధికారుల తనిఖీలు
- ఐదు ఉడుముల స్వాధీనం

ముకరంపుర, జూన్ 25: 'ఉడుమే కదా అని పట్టి విక్రయిస్తే చర్యలు తప్పవు. వన్యప్రాణి సంరక్షణ చట్టం ప్రకారం అరెస్ట్ తప్పదని' ఫారెస్ట్ అధికారులు హెచ్చరించారు. మంగళవారం ఉడుములను అక్రమంగా బంధించి విక్రయించే ముఠా గుట్టురట్టు చేశారు. జిల్లా అటవీశాఖ అధికారి సీహెచ్ బాలామణి తెలిపిన వివరాల ప్రకారం.. కొత్తపల్లి మండలం బావుపేటలోని తమిళకాలనీలో ఉడుములను బంధించి ఉంచారనే విశ్వసనీయ సమాచారం మేరకు అటవీ అధికారుల బృందం కాలనీలో సోదాలు చేపట్టింది. కాలనీకి చెందిన కోట రాజయ్య ఇంటి పక్కనే బంధించి ఉంచిన ఐదు ఉడుములను గుర్తించి విచారించారు. ఇదే కాలనీకి చెందిన కోట గొల్లయ్య, ధనవేని జంపయ్య, కోట రాజయ్య అనే ముగ్గురు కలిసి గుట్టల ప్రాంతం నుంచి ఉడుములను పట్టుకువచ్చి విక్రయించేందుకు వాటిని బంధించి ఉంచారని తెలిపారు. వన్యప్రాణి సంరక్షణ చట్టం ప్రకారం ముగ్గురిని అదుపులోకి తీసుకుని, ఐదు ఉడుములను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నిందితులను కోర్టులో హాజరు పర్చనున్నట్లు డీఎఫ్‌వో తెలిపారు. స్వాధీనం చేసుకున్న ఉడుములను అటవీ ప్రాంతంలో వదలి పెట్టనున్నట్లు చెప్పారు. సోదాల్లో ఎఫ్‌ఆర్వో శ్రీనివాస్ రెడ్డి, డిప్యూటీ ఎఫ్‌ఆర్వో నరసింగ రావు, ఎఫ్‌ఎస్వో శేఖర్, ఎఫ్‌బీవో అజీమ్, సిబ్బంది సర్వర్ ఉన్నారు.

## స్నేహితుడని నమ్మి కారు ఇస్తే..

- వాహనంలోని ముఖ్యమైన పరికరాలే మార్చేశాడు
- జీపీఎస్ ట్రాకింగ్ సిస్టంతో గుర్తుపట్టిన యజమాని
- పోలీసులకు ఫిర్యాదు.. కేసు నమోదు

వేములవాడ, జూన్ 25: వేములవాడ రాజన్న దర్శనానికి వెళ్తానన్న స్నేహితుడిని నమ్మి కారు ఇస్తే.. ఆ వాహనంలోని ముఖ్యమైన పరికరాలే మార్చేస్తూ పట్టుబడ్డాడో ప్రబుద్ధుడు. వేములవాడ పట్టణంలో ఈ ఘటన జరుగగా, యజమాని ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు. వేములవాడ పట్టణ ఎస్ఐ అంజయ్య తెలిపిన వివరాల ప్రకారం.. సిరిసిల్ల పట్టణానికి చెందిన రవికుమార్ తనకు పరిచయమున్న సన్నిహితుడు సాయి కృష్ణ వద్దకు వెళ్లి వేములవాడ రాజన్న దర్శనానికి వెళ్తున్నానని, కారు కావాలని అడిగాడు. దీంతో సాయి కృష్ణ తన మారుతీ ఎర్టిగా వాహనాన్ని ఇచ్చాడు. అయితే వస్తానన్న సమయం దాటిపోవడంతో సాయికృష్ణ తన వాహనానికి అమర్చిన జీపీఎస్ ట్రాకింగ్‌ను తన మొబైల్ ఫోన్ ద్వారా పరిశీలించాడు. అప్పుడే అసలు విషయం తెలిసింది. వాహనం రాజన్న గుడి వద్ద కాకుండా వర్క్ షాప్‌లో ఉన్నట్టుగా గుర్తించాడు. వెంటనే మరో స్నేహితుడి ద్వారా అక్కడికి చేరుకొని వాహనాన్ని ఏం చేస్తున్నారని ప్రశ్నించాడు. అప్పటికే అందులో అవసరం ఉన్న పరికరాలను తొలగించి ఇతర వాహనానికి అమర్చుకున్న విషయాన్ని సాయికృష్ణ గుర్తించాడు. వెంటనే వేములవాడ పట్టణ పోలీసులను ఆశ్రయించాడు. దీంతో రవికుమార్, షెడ్ మెకానిక్ కల్యాణ్ పై కేసు నమోదు చేశామని ఎస్ఐ అంజయ్య తెలిపారు.

## అంజన్న ఆలయ పర్యవేక్షకులపై చర్యలు!



మల్యాల, జూన్ 25 : కొండగట్టు అంజన్న ఆలయంలో మరో ఇద్దరు ఆలయ పర్యవేక్షకులపై చర్యలకు రంగం సిద్ధమైంది. నిబంధనలకు విరుద్ధంగా సెక్యూరిటీ గార్డులను నియమించి, నేరుగా జీతాలు చెల్లించిన వ్యవహారం నేరుగా అప్పటి కలెక్టర్ వద్దకు వెళ్లింది. నివేదిక ఆధారంగా ఇరువై రోజుల క్రితమే కమిషనర్ చర్యలకు ఆదేశాలు జారీ చేయగా, ఈ విషయం ఆలయవర్గాల్లో కలకలం రేపుతున్నది. నిబంధనల ప్రకారం ఆలయాల్లో ఉన్నతాధికారుల అనుమతితో గానీ, సొసైటీ లేదా ఏజెన్సీల నుంచి గానీ సెక్యూరిటీ గార్డులను నియమించుకోవాలి. కానీ, కొండగట్టు అంజన్న ఆలయంలో అందుకు విరుద్ధంగా వ్యవహరించారు. పాత ఏజెన్సీ ద్వారా నియమించిన 11 మంది సెక్యూరిటీ గార్డుల ఒప్పందం పూర్తయినా కొనసాగించారు. పైగా వీరికి 2023 ఏప్రిల్ నుంచి 2023 డిసెంబర్ వరకు ప్రతి నెలా జీతాలను నేరుగా చెల్లించారు. ఈ వ్యవహారంపై నాటి కలెక్టర్ యాస్మిన్ బాషాకు ఫిర్యాదు వెళ్లగా.. గత ఫిబ్రవరి ఒకటిన ఈవో వెంకటేశంతోపాటు ఇద్దరు పర్యవేక్షకులు సునీల్‌కుమార్, శ్రీనివాసశర్మకు అప్పటి మెమోలను జారీ చేశారు. తర్వాత వారు ఐదో తేదీన లిఖిత పూర్వకంగా వివరణ ఇచ్చినా సంతృప్తి చెందక చర్యలకు ఉపక్రమించారు. సదరు ఈవోతోపాటు ఇద్దరు పర్యవేక్షకులపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలంటూ ఏప్రిల్ ఒకటిన దేవాదాయ ధర్మాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావుకు నివేదించారు. నివేదికను పరిశీలించిన ఆయన, ఆలయ పర్యవేక్షకులు సునీల్‌కుమార్, శ్రీనివాసశర్మపై సెక్షన్ 37 ఎండోమెంట్ చట్టం 30/87, జీవోఎంఎస్ నంబర్ 830 ప్రకారం క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని ఈవో ఆవునూరి చంద్రశేఖర్‌కు ఈ నెల నాలుగో తేదీనే ఉత్తర్వులు జారీ చేశారు. ఇది ఆలస్యంగా వెలుగులోకి రావడంతో ఆలయ ఉద్యోగుల్లో వణుకు మొదలైంది. ఇప్పటికే అంజన్న సొమ్మును పక్కదారి పట్టించిన బాగోతంలో పలువురిపై వేటు పడగా.. తాజాగా సెక్యూరిటీ గార్డుల వ్యవహారం గుబులు పుట్టిస్తున్నది.



తొలిముఖ్యమంత్రి కేసీఆర్‌తో కౌశికహరిలత దంపతులు, కుమారుడు కౌశికభరత్

## కంగ్రాట్స్ కౌశికహరి

- కేశోరాం ఎన్నికల్లో గెలుపుపై అధినేత కేసీఆర్ అభినందనలు

పాలకుర్తి, జూన్25: బసంత్‌నగర్ కేశోరాం సిమెంట్ కర్మాగారం కాంట్రాక్టు కార్మికుల గుర్తింపు సంఘం ఎన్నికల్లో విజయం సాధించిన కౌశికహరిని తెలంగాణ తొలి ముఖ్యమంత్రి, బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ అభినందించారు. 'కంగ్రాట్స్.. కీపిటప్' అంటూ ప్రశంసించారు. కౌశికహరి లత దంపతులు, కొడుకు కౌశిక భరత్ మంగళవారం సిద్దిపేట జిల్లా ఎర్రబెల్లి ఫాంహౌస్‌కు వెళ్లి కేసీఆర్‌ను కలిసి కృ తజ్ఞతలు తెలిపారు. కౌశికహరిని కేసీఆర్ శా లువాతో సన్మానించారు. అనంతరం అక్కడే ఉన్న బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావును సైతం కౌశికహరి దంపతులు కలిసి కృతజ్ఞతలు తెలిపారు.